క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించాలి



ఎస్టీ కాలనీని సందర్శించిన సీపీఐ నాయకులు

పెనగలూరు: మండలంలో తరాలు మారుతున్నా యానాదుల తలరాతలు మాత్రం మారలేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి గానుపెంట ఆదినారాయణ అన్నారు. ఆదివారం నల్లపరెడ్డిపల్లి పంచాయతీ, ముల్లూరుపల్లి ఎస్టీ కాలనీని సీపీఐ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అయినా ఎస్సీ, ఎస్టీల తలరాతలు మాత్రం మారలేదన్నారు. ముల్లూరుపల్లి ఎస్టీ కాలనీలో 15 సంవత్సరాల నుంచి 10 కుటుంబాలు జీవిస్తున్నాయని, నేటికీ తాగునీటి సౌకర్యం కల్పించలేదన్నారు. ఆ కాలనీకి రోడ్లు, విద్యుత్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ స్తంభాలు ఆరునెలల క్రితం ఏర్పాటు చేశారని లైన్ మాత్రం తీయలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కార్యవర్గ సభ్యులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న రమేష్‌బాబు

రాయచోటి అర్బన్: రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చి వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు చేయూతనందించాలని రజకసంఘం జిల్లా అధ్యక్షుడు టి.రమేష్ బాబు కోరారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో రజకసంఘం జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు చాలీచాలని భత్యాలతో దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతూ బిల్లు అసెంబ్లీలో పెట్టి తీర్మాణం చేసి పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడం వలన సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. పలు మున్సిపాలిటీలు, గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న దోబి ఘాట్‌లను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లాఉపాధ్యక్షులు ఎం.వి.రమణ, వి. రామాంజులు, కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు మధు, ఆనంద్, సాంబశివ, మల్లిఖార్జున పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



నారాయణ నెల్లూరులో చలివేంద్రం ఏర్పాటు చేసిన కళాచంద్ర

పెనగలూరు: మండలంలోని నారాయణ నెల్లూరు గ్రామం,రాజంపేటలోని ఆర్‌అండ్‌బి రోడ్డు వద్ద మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఎంపీ వైద్యుడు కళాచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలుగా ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరను ప్రశాంతంగా నిర్వహించాలి

వీరబల్లి: మండలంలోని సానిపాయి పంచాయతీలో సోమవారం జరుగుతున్న గంగమ్మ జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కార్య నిర్వహకులకు ఎస్ఐ మోహన్‌నాయక్ సూచించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గంగమ్మ జాతరలో మొక్కుబడులు ఉన్న భక్తులు చాందినీ బండ్లు కట్టేవారు ముందుగా పోలీసుల పర్మిషన్ తీసుకోవాలన్నారు. జాతరలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, మద్యం సేవించి గొడవలకు పాల్పడిన కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. గంగమ్మ జాతర వద్ద వాహనాలు రాకపోకలకు ఆటంకం లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

మస్తానయ్యకు నివాళి



అల్పాహారం పంపిణీ చేస్తున్న దాతలు

నందలూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేసిన ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు పోతురాజు మస్తానయ్య మృతి చెందారు. నందలూరు లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం అరవపల్లిలోని ఆర్‌అండ్‌బీ కూడలిలో ఆయనకు నివాళి అర్పించారు. అనంతరం మస్తానయ్య కటుంబసభ్యులు పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోతుగుంట రమేష్ నాయుడు, ఎస్ఐ మన్నెం రామ్మోహన్, హిమగిరి నాథ్ యాదవ్, ఆదినారాయణ, అల్లం అశోక్ కుమార్, వెంకటేష్, కుర్రా మణి యాదవ్, ఉప్పుశెట్టి సుధీర్, జంగం శెట్టి సుబ్బయ్య పాల్గొన్నారు.

కరెంట్ బాదుడు..!

- ట్రూ అఫ్ చార్జెస్ పేరిట వసూళ్లు
- ఆలస్యం అయితే అపరాధ రుసుం
- లబోదిబోమంటున్న వినియోగదారులు



విద్యుత్ బిల్లు



గాలివీడు: ఫ్యాన్ వేయాలంటే భయం, టీవీ చూడాలన్నా భయం, ఏసీ ఆన్ చేయాలంటే మరొక భయం ఇన్ని భయాలు ఉన్నా నెల చివరిలో మాత్రం వేలకు వేలు కరెంటు బిల్లులు వస్తూనే ఉన్నాయి. మేం వాడటం లేదని కొట్టుకుంటున్న బిల్లు వస్తే కట్టాల్సిందే అంటూ అధికారుల ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాము వినియోగించని కరెంటుకు ఎందుకు కడుతున్నామో తెలియక అర్థం కాక కరెంటు బిల్లును చూసుకుంటూ నిద్రలేని రాత్రులు సామాన్య ప్రజలు గడుపుతున్నారు. 400 రూపాయలు వచ్చే కరెంటు బిల్లు నాలుగు వేల రూపాయలకు ఎందుకు పెరుగుతుందో తెలియటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ రాజకీయ నేతలు ఒకరిపై ఒకరు నిందారోపణలు వేసుకుంటున్నారే తప్పా. ప్రజా సమస్యలు పట్టడం లేదు. సామాన్యుడికి మాత్రం కరెంటు బిల్లులు గుదిబండగా మారాయి.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

సాధారణంగా విద్యుత్ బిల్లు రాగానే ఎంత వచ్చింది, ఎంత కట్టాలి అన్న ఆలోచనలోనే వినియోగదారుడు ఆలోచిస్తారు. అయితే కరెంటు వినియోగించ కుండానే అధిక కరెంటు బిల్లులు రావడంపై సర్వత్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా కరెంటు బిల్లులో స్థిరచార్జీలు కస్టమర్ చార్జీలు, విద్యుత్ కొనుగోలు ఖర్చు ఇతర చార్జీలతో కరెంట్ బిల్లులు వస్తూ ఉంటాయి. అయితే 2022 సంవత్సరంలో వాడిన కరెంటుకు తాము బిల్లు కట్టాము కదా అన్నా సరే చార్జీల రూపంలో మరో బాదుడు కరెంటు బిల్లు దర్శనమిస్తుంది. వాటిని ట్రూ అఫ్ చార్జెస్ అంటారు. ప్రధానంగా దుకాణదారులు అయితే వారు చేసే వ్యాపారాల రీత్యా కరెంటు బిల్లులు వస్తూ ఉంటాయి. అవి తెలియక వినియోగదారులు నూతనంగా దుకాణాల్లో చేరి విద్యుత్ భారం తమపై వేసుకుంటున్నారు. మూడు సంవత్సరాల క్రితం ఏప్రిల్ నెలలో 5,000 బిల్లు వస్తే ఈ సంవత్సరం కూడా దాన్ని లెక్కలోకి తీసుకొని విద్యుత్ వినియోగ చార్జీలు మోపుతున్నారు. ఎంతోమంది వినియోగదారులు తాము ఇంట్లో ఒక లైటు ఒక ఫ్యాను మాత్రమే వేసుకుంటున్నామని, అయినా వెయ్యి రూపాయల బిల్లు ఎందుకు వస్తుందంటూ విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తమకు సంబంధం లేకుండా వినియోగం లేకపోయినా విద్యుత్ వారాలు పడటంతో పాటు ప్రభుత్వం అందించవలసిన పథకాలు కూడా దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారం పడకుండా చూడాలి

అదే స్థాయిలో పెద్ద పెద్ద పరిశ్రమలకు కరెంటు వినియోగం ఎక్కువగా ఉంటుంది. వాటితో పాటు ప్రభుత్వానికి తెలియకుండా అనుమతులు లేకుండా ఆక్వా రంగాలలోనూ కొన్ని పరిశ్రమలకు విద్యుత్ వినియోగం జరుగుతూనే ఉంటుంది. అదే స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలకు, ప్రైవేటు ఫంక్షన్లకు విద్యుత్‌ను వినియోగిస్తారు. వీటికోసం ముందస్తుగా బ్యాంకుల్లో డీడీలు తీయవలసి ఉంటుంది. అయితే నామమాత్రపు డీడీలు తీసి ప్రభుత్వానికి భారీ గండి కొడుతూ కరెంటు అధికారులు తమ సొంత జేబుల్లోకి ఆ ధనాన్ని తీసుకుంటున్నారని ఆ కరెంటు వినియోగమంతా తమపై పడుతుందంటూ వినియోగదారులు సామాన్యులు వాపోతున్నారు.

హామీల అమలులో 'కూటమి' విఫలం



మాట్లాడుతున్న సాంబశివ, సురేష్

రాయచోటి అర్బన్: కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆ సంఘం రాయచోటి నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న జానాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచి కార్మికులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో మే 20వ తేదీన దేశవ్యాప్తంగా కార్మికసంఘాల ఆధ్వర్యంలో జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలంటూ వారు పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీనివాసులు, ఏఐటీయూసీ రాయచోటి కార్యదర్శి బి.వెంకటరమణ, నేతలు కేశవరావు, హరి, రాచరాయుడు, శేషాద్రి పాల్గొన్నారు.

స్థలం ఆక్రమణకు యత్నం



చేతిపంపుపై చెత్త చెదారం, కట్టెలు వేసిన దృశ్యం

పుల్లంపేట: రెడ్డిపల్లి పంచాయతీలో జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న చేతి పంపు వాడుకలో ఉన్నప్పటికీ కొంతమంది చేతిపంపుపై కట్టెలు, చెత్తా చెదారం వేసి ఆక్రమించారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు ఈ చేతిపంపు ఎంతో ఉపయోగపడేదని పేర్కొన్నారు. అయితే కొందరు చేతిపంపు స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని చెబుతున్నారు. కావున సంబంధిత అధికారులు స్పందించి చేతి పంపు స్థలం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



ఏరియా ఆసుపత్రిలో అగ్నిప్రమాదాలపై మాక్ డ్రిల్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజంపేట రూరల్: ప్రజలు అప్రమత్తతతో ఉంటే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని అగ్నిమాపక అధికారి కె. మాబుసుభాన్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో సిబ్బందికి అగ్నిప్రమాదాలపై మాబుసుభాన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు గ్యాస్ ప్రమాదం, వరదలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి మాక్ డ్రిల్స్ ద్వారా అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అదే విధంగా ఆసుపత్రిలో ఉన్న సీఓ2, విద్యుత్, అయిల్, గాస్ వంటి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే అగ్నిమాపకశాఖకు చెందిన 08565 240299, 99636 479554 నంబర్‌లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సిబ్బందిని కోరారు. అగ్నిమాపకశాఖకు చెందిన టెలిఫోన్ నంబర్లు, 101 గురించి వైద్యులకు, సిబ్బందికి తెలియజేశారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ వారోత్సవాలలో అగ్నిమాపక సిబ్బంది ఎల్ఎఫ్ బీ.శివయ్య, ఎల్ఎఫ్ బీసీఆర్ సుబ్రహ్మణ్యం, డి. శివయ్య, సి. నాగూర్ బాషా, ఎఫ్ఎంలు ఎస్ వెంకటసుబ్బయ్య, కె. రాజేశ్వర్, హెచ్‌జీలు సి.రవీంద్రబాబు, యు.రాజన్న, సి.రమేష్‌బాబు, బి.నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సైనిక పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కలికిరి: నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ), నావల్ అకాడమీ(ఎన్ఏ) కోర్సులలో ప్రవేశాలకు ప్రకటించిన తుది జాబితాలో కలికిరి సైనిక పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులకు స్థానం లభించినట్లు పాఠశాల వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. పాఠశాల తొలి బ్యాచ్ నుంచి ఇద్దరు విద్యార్థులు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్(సీడీఎస్) పరీక్ష, డైరెక్ట్ ఎంట్రీ ద్వారా ఇండియన్ మిలటరీ అకాడమీ(ఐఎంఎ), ఇండియన్ నావల్ అకాడమీ(ఐఎన్ఏ) కోసం ఎస్ఎస్‌బీలో ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

కేవీపల్లి: మండలంలోని నూతనకాల్వలోని చీనేపల్లె ఎల్లమ్మ ఆలయం వద్ద పంచమ వేద మహాభారత యజ్ఞం ఆదివారం ప్రారంభించారు. ద్రౌపదీ సమేత ధర్మరాజు, పాండవులు, శ్రీ కృష్ణుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి యజ్ఞం ప్రారంభించారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డిరాణి మొదటి రోజు వ్యాస జననం హరికథా గానం ఆలపించారు. రాత్రి శ్రీకృష్ణలీలలు నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



క్రీస్తు సందేశాన్ని తెలియజేస్తున్న పాస్టర్ మార్టిన్ లూథరన్

రాజంపేట టౌన్: నియోజకవర్గంలో ఆదివారం క్రైస్తవులు, విశ్వాసులు ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. తొలుత సమాధుల తోటలో వేకువ జామున పరలోకగతులైన కుటుంబ సభ్యులు, ఆత్మీయ బంధు మిత్రుల సమాధులను పూలతో అలంకరించి, కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చి పాస్టర్లు ఈస్టర్ పండుగ గురించి క్రైస్తవులకు, విశ్వాసులకు తెలిపారు.

ఈస్టర్ శుభాకాంక్షలు

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, రాజంపేట మండలంలోని తుమ్మల అగ్రహారంలో ఉన్న బేతేలు చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు, విశ్వాసులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు పాపిరెడ్డి విశ్వనాథరెడ్డి,మురళీరెడ్డి,రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

సుండుపల్లె : మండల పరిధిలోని గుల్లవాండ్లపల్లె దగ్గర సెయింట్ జాన్ లూథరన్ చర్చిలో పాస్టర్ జయరాజ్ ఏసుక్రీస్తు పునరుత్థాన వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తు పాపులను రక్షించడానికి ఈ లోకానికి వచ్చాడని గుడ్‌ఫ్రైడే రోజు తనను తాను బలిగా అర్పించుకున్నాడని, మూడు రోజుల తర్వాత అనగా ఆదివారం తిరిగి లేస్తాడు అనే నమ్మకంతో క్రైస్తవులంతా ఆదివారం రోజు యేసుక్రీస్తు యొక్క పునరుత్థాన దినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని తెలియజేశారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దవటం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ కార్పొరేషన్ రాయితీ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ ఫణిరాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ రుణాలను విడుదల చేసిందని, సిద్దవటం మండలంలోని అర్హులైన వారందరూ మే నెల 10వ తేదీ వరకు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెడికల్‌షాపు, మెడికల్ ల్యాబ్, ఎలక్ట్రిక్ బ్యాటరీ చార్జింగ్ యూనిట్, ఎలక్ట్రిక్ ఆటో, ప్యాసింజర్ కారు, గూడ్స్ ట్రక్ తదితర యూనిట్ల రుణాల కోసం మాత్రమే దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన వారందరూ సేవా కేంద్రాల్లో సబ్సిడీ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

• బోర్డు మూలకు.. సమాచారం కంచికి

ఉపాధి హామీ పనుల వద్ద సమాచార బోర్డు ఏళ్లుగా మూలనపడినా పట్టించుకోవడం లేదు. మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని మునగాని బండవంద ఫీడల్ ఛానల్ పనులు రూ.1.39 లక్షలు వెచ్చించి 2016లో పూర్తి చేశారు. జరిగిన పనిని ప్రజలకు తెలియజేస్తూ సమాచార బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం నిధులు మంజూరు చేస్తారు. అయితే అక్కడ పెట్టాల్సిన బోర్డును ఇదిగో ఇలా ఓ ఇంటి గోడ వద్ద మూలన పడేశారు. ఏళ్లు గడుస్తున్నా ఇది దిష్టిబొమ్మలా దర్శన మిస్తోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. – గుర్రంకొండ



• నీటి శుద్ధి కేంద్రం మూత



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రజలకు సురక్షితమైన మంచి నీరు అందించాలనే ఉద్దేశంలో ఏర్పాటుచేసిన నీటి శుద్ధి ప్లాంట్ ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. పీలేరు పట్టణంలో 26 ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం ప్లాంట్ల ఆపరేటర్లకు జీతాలు ఇవ్వకపోవడంతో వాటిని మూసివేస్తున్నారు. ఇప్పటికే చెన్నారెడ్డివీధి, షుకూర్ థియేటర్ వద్ద ఉన్న ఆర్‌వో ప్లాంట్లు మూసి వేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. – పీలేరు

కమనీయం.. సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. శ్రీరామ.. జయరామ.. జయ జయ రామ అని భక్తుల రామ నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. వరుడిగా రాముడు, వధువుగా సీతమ్మను చూసి భక్తులు పులకించారు. సీతారాముల కల్యాణ క్రతువును అర్చకులు సాయి ఆధ్వర్యంలో వేదపండితులచే వి.వి ప్రతాప్‌రెడ్డి, భాగ్యమ్మ దంపతులు జరిపారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో మహిళలు తరలివచ్చారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కల్యాణ వైభోగమే..



రాములోరి కల్యాణ మహోత్సవం

రాజంపేట టౌన్: మండలంలోని డీబీఎస్‌పల్లె గ్రామంలో ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను ప్రత్యేక పుష్పాలతో, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం పురోహితులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ క్రతువును శాస్త్రోత్సకంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం కల్యాణ ఉత్సవ మూర్తులు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

మల్లూరమ్మా.. కాపాడు తల్లీ



ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు, కొత్తపల్లె గ్రామాల పంచాయతీ పరిధిలో వెలసిన శ్రీ మల్లూరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ఆలయ అర్చకులు పలు రకాల పుష్పాలతో అలంకరించారు. ఈ సందర్భంగా మొక్కుబడులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నాగారపమ్మకు పూజలు



పూజలందుకుంటున్న నాగారపమ్మ తల్లి

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాల్వ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయాన్నే పూజారులు అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా బోనాల పండుగ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సిద్దవటం: మండలంలోని మాధవరం–1 గ్రామ పంచాయతీ పరిధిలోని బంగారుపేట గ్రామ శివారులో వెలసిన గంగాభవాని అమ్మవారి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గణపతిపూజ, పుణ్యాహవాచనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు మాడా పెద్దసుబ్బరాయుడు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సికింధర్

రాజంపేట రూరల్: కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలపై మేడే పోరాట సస్ఫూర్తితో పోరాడుదామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఈ. సికింధర్ పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఏఐటీయూసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు కార్మిక వర్గం పోరాడీ సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని కార్మిక ఓట్లతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకోవటమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. వ్యవసాయ, సహకార రంగాలను కార్పొరేట్ శక్తులకు అప్పగించటానికి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. మేడేను పురస్కరించుకొని మే 20వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ, ఆటోవర్కర్స్ యూనియన్, హమాలీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



విశ్రాంత ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్‌లో 1991–92 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం పేరుతో అదే పాఠశాలలో సందడి చేశారు. 34 ఏళ్ల తరువాత ఒకేచోట సమావేశమైన వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, చిన్న నాటి మధురస్మృతులను నెమరు వేసుకుని ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన హెచ్‌ఎం వెంకటాచలపతి, హిందీ టీచర్ రహీంసాబ్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం తాము జీవితంలో ఎంతటి ఉన్నతమైన స్థానంలో ఉన్నా కూడా చదువుకున్న విద్యాలయం అభివృద్ధికి తమ వంతు సాయం అందిద్దామని మిత్రులందరూ తీర్మానించుకున్నారు. సుదీర్ఘ విరామం తరువాత మిత్రులందరూ మళ్లీ ఎప్పుడు కలుసుకుంటామోనని బరువెక్కిన గుండెలతో వీడ్కోలు పలుకుతూ వెనుదిరిగారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు

పీలేరు: స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి అమరనాథ్ పేర్కొన్నారు. గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వేసవిలో బయట తిరగకుండా, టీవీలు, సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా తమ మేథో శక్తి పెంచుకోవడానికి విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు విద్యార్థులు డ్రాయింగ్, చెస్, చేతివ్రాత, క్యారంబోర్డు ఆటల్లో పాల్గొన్నారు.



వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు